కథా నిలయం
1489
శ్రీకాకుళం

# డైరీ

గోడమీద గడియారం పదకొండు సార్లు కొట్టింది.

ఆలోచిస్తో కుర్చీలో కన్నుమూసిన ధనలక్ష్మి—పీడ కలలోంచి మేల్కొన్నట్టు ఒక్కసారి మేల్కొంది. గోడమీది గడియారం వంక చూసింది.

ఇంకా రాలేదు వారు. ఎంతసేపని తను ఇట్లా కళ్లల్లో వొత్తులు వేసుకొని కనిపెట్టుకు కూర్చోవడం? ఎన్ని రోజులు రాత్రిళ్లు ఇట్లా పొద్దు పోయేవరకూ ఎదురు చూస్తూవుంటుంది? ఇల్లాలి ధర్మంగా అదేమని నోరు తెరచి అడిగితే-చీడపురుగువంక చూసినట్టు చూసి, విసుక్కొని, సినిమాకు వెళ్ళాననో, క్లబ్బులో చీట్లపేక ఆడుతున్నాననో, స్నేహితులతో రాజకీయ చర్చలలో పాల్గొన్నాననో, ఏదోవొక కారణం చెప్పి నమ్మించేందుకు ప్రయత్నిస్తారు!

తన హృదయంలోని అర్థంకాని కోత, ఆలకించరు. వారి చేష్టలు, స్వభావం, వారి మిత్రులు—తనకి ఏం తోచదు? వారు రాత్రులు ఇంత కాలంవరకు ఎక్కడ కాలక్షేపంచేస్తారో తనకి యీనాటికీ ఒక స్పష్టమైన అభిప్రాయం లేదు. ఇల్లాలిగా యీ ఇంట్లో ప్రవేశించినప్పటి దగ్గర్నుంచీ-

తను ఒక్కసారైనా వారి మనస్సును నొప్పించి యెరుగదు. వారి క్షేమాన్నే సదా కాంక్షించటం తన ధర్మం. కాని ఆయన గారికి తన మీద ఎందుకనో దయలేదు, ప్రేమలేదు. తన కోర్కెల్ని, తన అభిరుచుల్ని—ఆలోచించేందుకు ఆయనగారు యీపది సంవత్సరాల కాపరంలో ఎన్నడూ ప్రయత్నించినట్టు అగపడదు. తను ఏంపాపం చేసుకుంది? వారికి తనుగాక మరెవరు ముఖ్యం? వారి స్వభావమే అంతేనేమో? వారిని తను సరీగ్గా అర్థంచేసుకోలేక పోతున్నదేమో...? కాని ఆయనగార్ని తను తప్పుపట్టే మాత్రపుదా? బాగా చదువుకున్న వారు—రెండు వందల రూపాయల ఉద్యోగం చేస్తున్నవారూ, సాటివారిలో ఒక స్థానాన్ని ఏర్పరచుకొని మర్యాదగా బ్రతుకుతున్న వారూ—భార్యని అభిమానించ లేని అజ్ఞానులా? భార్యకు ద్రోహం చేసేసాటి దుర్మార్గులా ?

కాని తను వారిని అర్థం చేసుకోలేక పోతోంది...ఈమధ్య ఆఫీసు ప్యూను ఒకడువచ్చి 'అయ్యగారు ఆఫీసుకు సరిగ్గా రావడం లేదు, కారణ మేమిటమ్మగారూ!' అన్నాడు. ఆ మాటలు వినగానే తన మనస్సు చివుక్కుమంది. ఇంటిదగ్గర నిత్యమూ సక్రమమైన వేళకు బయలుదేరు తూనే ఉన్నారాయె...మరి ఆఫీసుకు సరీగ్గా ఎందుకు వెళ్లటం లేదు? వారి ప్రవర్తనను గూర్చి తను ఎట్లా వూహించుకోవటం ?

ధనలక్ష్మికి అప్రయత్నంగా కళ్లవెంట నీళ్లు తిరిగినయ్. ఒక రూపాన్ని ధరించని అనుమానాలు ఆమె హృదయంలో వూడలుదించుకొని కలతపెట్ట సాగినాయి. ఒక వాస్తవాన్ని తెలుసుకోవడం కోసం,—ఆమె హృదయంలో అంతులేని అలజడి, విపరీతమైన భయం !

గాలికి కిటికీ రెక్కలు కొట్టుకుంటున్నాయి. మబ్బులు దట్టంగా పట్టినయ్, వానవొచ్చే వాతావరణం ఉంది.

ధనలక్ష్మి కుర్చీలోంచిలేచి కిటికీ రెక్కలు మూసింది.వొచ్చి మంచం మీద కూర్చుంది. బయటతలుపు చప్పుడు వినపడ్డది. గబుక్కునలేచి తలుపు తీసింది.

సీతారామారావు లోపలికొచ్చాడు. చాలా నీరసంగా ఉన్నాడు. అటూ ఇటూ వూగుతూ మంచంమీద పోయివాలాడు. ధనలక్ష్మి హృదయం టపటప లాడింది. భర్తనుదురుమీద అరిచేయివేసి చూసింది. జ్వరం మండి పోతోంది.

'అబ్బా!' బాధగా నిట్టూర్పు విడిచాడు సీతారామారావు.

'ఏమిటండీ! వొంట్లో ఎట్లా ఉంది? ఇప్పటివరకూ ఇంటికి రాకుండా ఎందుకున్నారు?' అన్నది ధనలక్ష్మి.

సీతారామారావు కొంచెంగా వొణికి పోతున్నాడు.

'ఆ శాలువా కాస్త కప్పు. ఏం లేదు. ఏదో వొంట్లో కాస్త తిప్పి నట్టు వుంటేనూ! అంతే!'

శాలువా కప్పింది ధనలక్ష్మి. తలగడ దగ్గర కూర్చునే ఆలోచిస్తో కన్నీళ్ళు కార్చ నారంభించింది. పన్నెండు కాగానే ఆమెకూడా మెల్లిగా మేను వాల్చింది.

కొంత సేపటికి సీతారామారావు ముసుగు తొలగించాడు. ఇంకా ఆయన శరీరంలో వొణుకు తగ్గలేదు. మంచం మీదనుంచి మెల్లగాలేచాడు. బెడ్ లైట్ కాంతిలో గదంతా అస్పష్టవాతావరణంలో ఉంది. తూలుతో డ్రాయరు దగ్గరకువెళ్ళి లైటు వేశాడు. ఆలైటుకు ధనలక్ష్మికి కొద్దిగా మెలకువ కలిగింది. భర్త డ్రాయరు తీస్తోన్నట్టు చూసింది. అర్ధరాత్రిలో డ్రాయరు తీయాల్సిన అవసరం? కాని చాలాసార్లు అర్ధరాత్రిలో, తను పడుకున్నప్పుడు డ్రాయరు తీయడం చూసింది. ధనలక్ష్మి నిద్రపోతున్నట్టు నటిస్తూ, సాధ్యమైనంత నేర్పుతో భర్తని కనిపెట్టుతోంది.

సీతారామారావు డ్రాయర్లోంచి డైరీ తీశాడు. ఏదో రాశాడు. మళ్ళీ డైరీని డ్రాయర్లోపెట్టి, తాళంవేసి, లైటు ఆర్పేసి-పడుకున్నాడు.

ఆ డైరీలో ఏం రాశాడు? ఈ అర్ధరాత్రప్పుడు రాయవలసిన అగత్యం ఏం కలిగింది? ఆ డైరీలో ఏ విషయాలు ఉన్నాయి? తను పది సంవత్సరాలుగా చూస్తోంది-ఆడైరీని భర్త అతి రహస్యంగా అట్టిపెట్టి, ఎవరికంటా, చివరికి అర్ధాంగియైన తన కంటకూడా పడకుండా కాపాడుకు రావడంలో ఆంతర్య మేమిటి? అందులో రాసే రహస్యాలు ఏమిటి? ఇనప్పెట్టి తాళంచెవులైనా తనకి యిస్తాడుగానీ ఆ డ్రాయరు తాళం చెవులు తనకి ఇవ్వడు. తను ఎన్నడూ తీసుకోనేందుకు ప్రయత్నించ లేదు. ఇన్నాళ్ళుగా తనకి ఆ డైరీని గురించి పెద్ద ఆలోచన లేదు. కాని ఆ డైరీలో ఆయనగారు కొన్ని విషయాలను నిక్షిప్త పరుస్తున్నారు. ముఖ్యంగా తను తెలుసుకోరానివేమో! భార్యకు రహస్యంగా వుంచే విషయాలతో జీవించే

భర్త నైతిక విలువ ఎటువంటిది? ఆ రహస్యాలను తన ముందు దాచ గలరు గాని—లోకం ముందు ఎట్లా దాచగలరు? రేపో, ఎల్లుండో కర్మంచాలక ఆ రహస్యాల తాలూకు వాస్తవం బట్టబయలైతే ఆయన గారి బ్రతుకులోని సాంఘిక విలువలు ఏమవుతాయి? వారిజీవితం తనకి అర్థం కావటం లేదు. తనకి అర్థం కాకుండా వారు జీవించటానికి యత్నించడంలో, వారు ఎటువంటి సౌఖ్యాన్ని పొందుతున్నారో కూడా తనకి తెలీదు. తెల్లవారుఝామున కోడికూసేవరకూ ధనలక్ష్మి ఆలోచిస్తూనే ఉంది—

మరునాడు సీతారామారావు పరిస్థితి భయంకర పరిణామంలోకి మారింది. అది ఎటువంటి జ్వరమో అంతుబట్టకుండా ఉంది. బాకుపోట్లు తిన్నవాడు బాధపడుతో మూలిగినట్టు మూలిగాడు. మధ్యమధ్య విపరీతమైన నొప్పితో బాధ పడుతోన్నట్టు గిలగిలా కొట్టుకుంటాడు.

ధనలక్ష్మి డాక్టర్ను పిలిపించింది. కాని డాక్టరు పరీక్షించేప్పుడు సీతారామారావు భార్య తనదగ్గర ఉండరాదని తీవ్రంగా శాసించటంతో ధనలక్ష్మి హృదయంలో అస్పష్టంగా కదుల్లాడుతోన్న అనుమానాలు అంతలోనే పెరిగి పెద్దవై — ఒక స్థానాన్ని నిలదొక్కుకొని ఆమె మనస్సును తారుమారు చేసినై.

డాక్టరు బయటికొచ్చాక ధనలక్ష్మి డాక్టరును నిలదీసి అడిగింది. కాని డాక్టరు నిజం చెప్పలేదు. హృదయానికి సంబంధించిన జబ్బనీ, అధైర్య పడవలసిన పనిలేదనీ చెప్పాడు.

కాని ధనలక్ష్మికి డాక్టరు తన ఎదుట వాస్తవాన్ని కప్పిపుచ్చుతున్నాడనే సందేహం కలక్క పోలేదు. అందుకు తగినట్టుగానే డాక్టరు రోగిని తన హాస్పిటల్లోకి తీసుకెళ్లాలనీ, తన నర్సుల పరిచర్యలోనే వుండాల్సి వొస్తుందనీ చెప్పాడు. ధనలక్ష్మి డాక్టరుగారిదగ్గర బావురుమని ఏడ్చింది.

'మీరు నా భర్త జబ్బును నాతో చెప్పటానికి దాస్తున్నారు. నిజం చెప్పండి! వారికి నాకంటె కావాల్సిన వారు ఎవరు ఉన్నారు? భార్యాభర్తల మధ్య మీరొక అగాధాన్ని కల్పించి పాపం కట్టుకుంటున్నారు. మీకు ఇది ధర్మం కాదు. వారు ఏ రోగంతో బాధ పడుతున్నారో చెప్పండి—'

'రోగం పేరు చెప్పినంత మాత్రాన నువ్వు చేసేది ఏమీ లేదమ్మా! అది ఏ రోగమైనా నేను నయం చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పుడు నీకంత ఆవేదన ఎందుకు? శాంతంగా ఉండు. శాయశక్తులా ప్రయత్నించి మీ వార్ని సాధ్యమైనంత త్వరలోనే మామూలు మనిషిగా తయారు చేస్తాను.'

డాక్టరు ఎంత చెప్పినా ధనలక్ష్మి వినలేను.

'రోగి ఈ ఇంట్లో ఉంటే రోగం నయమవు తుందనే హామీ నేను ఇవ్వ లేను' అని ఒకరోజు డాక్టరు ఖచ్చితంగా చెప్పాడు.

ధనలక్ష్మికి భయం వేసింది. తన పట్టుదలని జారవిడుచుకుంది. భర్త జబ్బును గురించి తనకి పట్టుదల ఏమిటి? ఏ రోగమైనా నయమై, ఆరోగ్యవంతుడు కావడమే తనకు కావాల్సింది.

సీతారామారావును హాస్పిటల్లో చేర్చారు. రోజూ నాలుగైదు సార్లు వెళ్లి ధనలక్ష్మి భర్తనుచూసి వొస్తోనే ఉంది. ఆమె చాలా దేవుళ్ళకు మొక్కుకుంది—తన భర్తను కాపాడమని.

ఆమెకు ఒకరోజు, మధ్యాహ్నం హఠాత్తుగా ఒక ఆలోచన కలిగింది. ఆ డ్రాయర్లోని డైరీ తీసి మాస్తే! డ్రాయరు తాళం చెవికోసం భర్తగారి విడిచిన చొక్కాలన్నీ చూసింది. కాని ఆ తాళం చెవి దొరకలేదు. ఆయనగారి దగ్గరే వుంటుందని నిశ్చయించుకుంది. ఆలోచిస్తో అట్లానే కుర్చీలో కూర్చుంది. సాయంత్రం మూడైంది.

ఒక కుర్రవాడు ఆదుర్దాగా పరుగెత్తు కొచ్చాడు ఇంట్లోకి.

'డాక్టరుగారు మిమ్మల్ని అర్జంటుగా రమ్మన్నారు' అన్నాడు వూపిరి పీల్చుకోనేందుకు కూడా అవకాశం లేని వేగంతో.

ధనలక్ష్మికి కాళ్ళూ చేతులూ ఒక్కసారి చల్లబడ్డాయి. గుండె కొట్టుకోవటం మానివేసిందా? కుర్చీలో అలానే ఉండిపోయింది. ఆ కుర్ర వాడు 'డాక్టరుగారు అర్జంటుగా రమ్మంటున్నారు' అన్న వాక్యాన్ని బిగ్గరగా వల్లె వేస్తున్నాడు. కొంతసేపటికి తేరుకొని జట్కాలో వెంటనే డాక్టరుగారి ఇంటికి వొచ్చేసింది.

వరండాలో ధనలక్ష్మిని చూసి డాక్టరు అరిచేతిలో ముఖం కప్పుకున్నాడు. ధనలక్ష్మి కెవ్వున కేక వేసింది. ఆ కేకకు ఆ వరండా ధ్వనించింది.

సీతారామారావు ముఖంమీద తెల్లటి గుడ్డ కప్పబడి ఉంది. ఆ దృశ్యం చూడగానే ధనలక్ష్మి గుండె పగిలి ముక్కలైంది. ఆమె ఏడ్పుకు గదిలోని నాలుగుగోడలూ కదుల్లాడినయ్. ఆమె నేత్రాల్లోంచి జారే కన్నీటి ధారలకు భూమి గజ గజ లాడింది!

తన మాటను దక్కించుకోలేక పోయాననే విచారంతో డాక్టరు క్రిందూ మీదూ అయినాడు. తను ముందుగా ఆ జబ్బు పరిస్థితి చెపుతే పోయేది కాని, సీతారామారావు చెప్పవొద్దని తన చేత ఒట్టు వేయించు కున్నాడు. తను ఎట్లా చెబుతాడు? 'డాక్టరుగారూ నేను జీవితాన్ని కామంతో ముడిపెట్టి-బ్రతికినన్నాళ్లూ డబ్బుతో లభ్యమయ్యే ఆనందాన్ని పెద్ద మొత్తంగా పొందుదా మనుకున్నాను. కాని ఆ విధంగా జీవితాన్ని గడపడం వల్ల ఏర్పడిన భయంకర పరిణామాన్ని అనుభవ పూర్వకంగా చూస్తోంటే —విషం త్రాగి చావడం మేలనుకుంటున్నాను. నా ఆశయం లోని అమృతం-చివరకు విషంగా మారింది. విషంతో మనిషి ఎక్కువ కాలం జీవించలేడు. కాని ఇప్పుడు తెలిసి వొస్తోంది-నేను జీవితంలో ముఖ్యమైన ఘట్టాల్లో తప్పటడుగు వేశానని. లోకం ముందూ, భార్య ముందూ నాకు గౌరవం ఉంది. నేను బ్రతికుండగా ఆ గౌరవాన్ని మంటగల్పుకోవడాన్ని నేను చూడలేను. నే బ్రతికున్నంత వరకూ నా విలువల్ని కాపాడవల్సిన బాధ్యత మీది' అని అన్నాడు సీతారామారావు! అటువంటి పరిస్థితుల్లో తను ఎట్లా చెపుతాడు? తను సర్వవిధాలా ప్రయ త్నించాడు. కాని ప్రమాదకరమైన జబ్బు! మందు ఏమీ పనిచేయలేదు. తన దగ్గరకు వచ్చేటప్పటికే జబ్బు బాగా ముదిరి పోయింది.

'డాక్టరుగారూ! మావార్ని నాకు దూరం చేశారు.' అన్నది ధన లక్ష్మి గుండె బాదుకొంటూ.

ఆ ఇల్లాలి దుఃఖం చూసేటప్పటికి డాక్టరు హృదయం తల్లడిల్లింది.

'నేను చేసేది ఏముందమ్మా? వారే చేతులారా తెచ్చుపెట్టు కున్నారు. అది ఒక రకమైన భయంకరమైన సుఖవ్యాధి. సుఖమూ, గౌరవమూ, హోదాకు-దడిచి, వ్యాధిని పెంచుకున్నారు. చివరకు తను చావునే తెచ్చి పెట్టుకున్నారు. నే చేయగలిగిందంతా చేశాను. వారు జీవితాన్ని వక్రమార్గంలో గడిపారు. అందువల్ల లభించే ఆనందానికి ఆశించారు. కాని ఆ ఆనందంలో హాలాహలం ఉందని తెలుసుకోలేప్ప

టికి మరణమే సెట్టుకు వొచ్చింది. 'జీవితం' అన్న పదానికి సరైన అర్థం తెలుసుకొని జీవించటంలోనే ఉంది జీవితం. తప్పుడు అర్థాలకు దాసులై తే-బ్రతుకు కూడా అట్లానే ముగుస్తుంది.' అన్నాడు డాక్టరు.

ఆమెలో దుఃఖమంతా ఒక్కసారి ఘనీభవించింది. తన భర్త ఒక సుఖవ్యాధికి బలి అయినాడు. ఇల్లాలి బాధ్యతలను వేరే విధంగా తను భావించింది. భర్త ఎటువంటి మనస్తత్వం కలవాడైనా—ఇల్లాలి వ్యక్తిత్వము, ఆ మనస్తత్వాన్ని విమర్శించకుండా వుండటమే! భర్తకు ఎదురు చెప్పడమూ, భర్త జీవితాన్ని తన విజ్ఞానంతో సంస్కరించాలని తాపత్రయ పడటమూ, మనస్సులో భర్తను న్యూనతగా భావించడమూ, అపహాస్యం చేసేందుకు ప్రయత్నించడమూ, భర్త వ్యాపకాలకూ అభిరుచులకూ పరిమితిని యేర్పరిచేందుకు ముందుకు రావడమూ - భార్య ఐన స్త్రీకి ఎంతమాత్రమూ తగదని తను ఇన్నాళ్ళూ నమ్మింది! కాని వారు తనని మోసగించారు. తనకు ద్రోహం తలపెట్టి—చివరకు తనని పుట్టెడు దుఃఖంలో వొదలి వెళ్ళారు.

'ఈ తాళం చెవి నీకు ఇవ్వమని చెప్పాడు' అని డాక్టరు జేబులోంచి డ్రాయరు తాళం చెవి తీసి ఇచ్చాడు.

డ్రాయర్లో డైరీ ఉంది. ఆడైరీని తనకంట పడకుండా ఇన్నాళ్ళూ-తాళం చెవి తనకి అందకండా వుంచుతూ వొచ్చారు. ఆ డైరీలో వారు ఏం రాసేవారో?

బంధువుల్లో కొంతమంది వొచ్చాక సీతారామారావు శవాన్ని దహనం చేయడం జరిగింది. సీతారామారావు ఏం జబ్బువొచ్చి చనిపోయాడని బంధువులు వేసిన ప్రశ్నకు ధనలక్ష్మి ఒకే సమాధానం చెపుతూ వొచ్చింది. 'ఆ మాయిదారి జబ్బేమిటో డాక్టరుకే తెలియాలి.' ఆ సమాధానానికి కొంతమంది ఆశ్చర్య పోయారు.

పదిహేను రోజుల తరువాత సీతారామారావు పెద్దదినం కూడా అయిపోయింది.

భర్త చావుతో ధనలక్ష్మి రూపం భౌతికంగానే కాకుండా—మానసికంగా చాల మారింది. ఆమె సరిగా భోజనం చేయదు. ఇరుగు పొరుగువాళ్ళతో మాటాడదు. ఆలోచిస్తో, కుమిలి కుమిలి బాధపడుతో

వుంటుంది. ఓదార్చటానికి వచ్చిన వాళ్ళతో: 'నేను మావార్ని నాచేతులారా చంపుకున్నాను. వారిని సక్రమ మార్గంలోకి పెట్టుకోలేకపోయాను. వారు చనిపోవటానికి నా బాధ్యతా ఉంది. ఇంక నేను మట్టుకు బ్రతికి ఏం లాభం?' అనడం మొదలు పెట్టింది. వాళ్లు ఆమెకు భర్త దిగులుతో పిచ్చి కూడా ఎక్కినట్టు సులభంగా భావించారు.

తల్లి ఆమెని తన సంరక్షణలో ఉండేటట్టు చూస్తోంది.

ఆ మధ్యాహ్నం గదిలో కూర్చున్నప్పుడు ధనలక్ష్మికి డ్రాయర్లోని డైరీ విషయం స్ఫురణకు వొచ్చింది. ఆ బీరువాలోని తాళం తీసుకొచ్చింది. తీరా డ్రాయరు దగ్గరకు వొచ్చేటప్పటికి ఆమె చేతులు వొణికినయ్!

తను ఏం చేయబోతోంది? జీవితకాల మంతా తనకి భర్త చూపరాని విషయాన్ని, వారు పోయాక తను చూడబోతోంది. భర్త తనకి ఆ డైరీని అంత రహస్యంగా ఎందుకుంచాడు? తను ఇప్పుడు చూడబోవడం అపచారం కదూ! జీవించిన కాలంలోని వారి గౌరవ మర్యాదలనూ, నీతీ అవినీతుల్నీ - తను పరీక్ష చేయబోవడమా? తనకి ముఖ్యమైనవారే ఇప్పుడు లేనప్పుడు—తనకి ఆ డైరీలోని విషయాలను తెలుసుకోవాలనే కుతూహలమెందుకు కలగాలి?

డైరీలోని విషయాల్ని చూసేందుకు ఆమె మనస్సు ఒప్పలేదు. బతికి వుండగా భర్తమీది గౌరవ మర్యాదలు ఆయన పొయ్యాక తగ్గటంలో అర్థం లేదు. ఏమైనా అది ఆయన జీవిత రహస్యం. దాన్ని కాపాడాల్సిన బాధ్యత తనకు వుంది.

తను కాకుండా యీ డైరీ ఇంకెవరన్నా చూడటం తటస్థించవొచ్చు; లేక ఏనాడన్నా తన మనసు మారనూవొచ్చు. డైరీయే లేకుండా చేస్తే ఆయన గౌరవానికి ఎలాటి భంగమూ వాటిల్లదు.

ఆమె వెంటనే డ్రాయర్లోని డైరీ తీసింది. మరో ఆలోచన లేకుండా దాన్ని మండేపొయ్యిలో పడేసింది. కాగితాలు మసి అవుతూన్న కొద్దీ ఆమె మనస్సు తేలిక పడసాగింది. ఆ మంట తాలూకు వెలుగు ఆమె ముఖం మీదపడి ఉజ్వలంగా, ఆమె ముఖ కళలోని ప్రశాంతతను, చాటింది. ఐతే ఆ డైరీలో ఏం రాయబడి వున్నదో ఎవ్వరికీ ఎప్పటికీ తెలియదు!

★